www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 డిసెంబర్ 2024

5

వైఎస్ఆర్



నేడు డయల్ యువర్ కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, అలాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చు అని తెలిపారు. అంతకు ముందు ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


ధరల దరువు



- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాలు
- అందనంటున్న కూరగాయలు
- అల్లాడుతున్న సామాన్య ప్రజానీకం
- ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇటు నిత్యావసరాలు, అటు కూరగాయల ధరలు ఆకాశాంటుతున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యుడికి కనీసం పచ్చడి మెతుకులు కూడా కరువైంది. మార్కెట్లో వంటింటి సామాగ్రి ధరలు మోత మోగిస్తున్నాయి. కంది, మినప పప్పుల ధరలు ఉడుకుతున్నాయి, నూనె ధరలు కాక రేపుతున్నాయి, సామాన్యుని వంట గది సరుకులు లేక ఖాళీగా ఉన్నాయి. పప్పులు, వంటనూనె, కూరగాయల ధరలు ప్రజలకు అందనంత ఎత్తుకు పోయాయి. ప్రభుత్వాలు మారినా సామాన్యుని బతుకు మారలేదు. ధరలను అదుపుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. వెల్లుల్లి, ఎండుమిర్చి వంటి నిత్యావసర ధరలు సైతం ఆకాశాన్నంటడంతో సామాన్యుడి బతుకులు భారంగా మారాయి. తాము ఎంచుకున్న సమస్యలు ఉడుకుతున్నాయ్ అని ప్రభుత్వాలు భావిస్తున్న పరిస్థితి. పౌష్టికాహారంలో కీలక పాత్ర పోషించే పప్పుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుతం మార్కెట్లో ధరలు చూసి జనం బెదిరిపోతున్నారు. కిలో కందిపప్పు రూ.180 పలుకుతుండగా, మినపప్పు రూ.115, శనగపప్పు రూ.125, పెసరపప్పు రూ.160 వరకూ పలుకుతున్నాయి. దీంతో గతంలో కిలో పప్పు ఉపయోగించే కుటుంబాలు ఇప్పుడు అరకిలో ఉపయోగిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పౌష్టికాహార లోపంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న పరిస్థితి నెలకొంది. సబ్సిడీపై కొన్ని సరుకులు అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్న మాటలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయి. గతంలో నెలవారీ సరుకులకు ఖర్చు రూ.రెండు వేలు వెచ్చించే కుటుంబాలు ఇప్పుడు ఏకంగా రూ. నాలుగు వేలకు పైగా వెచ్చించాల్సిన పరిస్థితి. సామాన్య ప్రజానీకం రోజంతా కష్టపడితే వచ్చే సొమ్ము రూ.400 మాత్రమే. నెలలో 20 రోజులకు మించి పనులుండవు. నెలకు ఎక్కువగా లెక్కిస్తే రూ.ఎనిమిది వేలకు మించి ఆదాయం రాని పరిస్థితిలో జిల్లాలో లక్షల కుటుంబాలున్నాయి. మాల్స్, వ్యాపార దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు రూ.ఏడు నుంచి రూ. తొమ్మిది వేల వరకూ మాత్రమే వేతనాలు అందుకుంటున్నారు. అంతంతమాత్రం ఆదాయం ఉన్న కుటుంబాలు ఈ ధరలతో బతుకు నెట్టుకురాలేక నానా ఇబ్బందులు పడుతున్నాయి. పప్పుల ధరలతోపాటు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరల చూసి జనం వణికిపోతున్నారు.



వెల్లుల్లి, ఎండుమిర్చి ధరలు పైపైకి..

ఆరోగ్య రీత్యా వంటింట్లో అధికంగా ఉపయోగించే వస్తువు వెల్లుల్లి. ప్రస్తుతం వెల్లుల్లి ధర కిలో రూ.400 పలుకుతోంది. పావు కిలో అయితే రూ.110 తీసుకుంటున్నారు. దీంతో వెల్లుల్లి కొనుగోలు చేయాలంటే జనం భయపడే పరిస్థితి నెలకొంది. రోజూ తాలింపుల్లో ఉపయోగించే ఎండుమిర్చి ధర ఏకంగా కిలో రూ.260కు చేరింది. దీంతో తాలింపుల్లో ఎండుమిర్చి వేయాలంటేనే జనం వణికిపోతున్నారు. విజయ్ ఆయిల్ రూ.155 వరకూ పలుకుతుండగా సన్ ఫ్లవర్ వంటి మిగిలిన వంట నూనెల ధరలు కిలో రూ.145 వరకూ పలుకుతున్నాయి. పంచదార, ఇడ్లీ రవ్వ, బొంబాయి రవ్వ వంటి నిత్యావసర వస్తువుల ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. దీంతో సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కూరగాయల ధరలు సైతం అంతే స్థాయిలో మండిపోతున్నాయి. కిలో అల్లం పాతిక రూ.120 పలుకుతోంది. క్యారెట్ కిలో రూ.64, క్యాబేజీ కిలో రూ.76, ఉల్లి ధర కిలో రూ.70 ఇలా ప్రతి కూరగాయ ధర కిలో రూ.60పైనే పలుకుతోంది. ప్రభుత్వం కేవలం వెల్లుల్లి గురించి మాత్రమే మాట్లాడుతూ కాలక్షేపం చేస్తోంది. అదుపులేకుండా పెరుగుతున్న ధరలతో సామాన్యుల బతుకులు రోజురోజుకూ కష్టంగా మారుతున్నాయి. దీంతో ప్రతి వస్తువూ తక్కువ పరిమాణంలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో తగినంత మోతాదులో తీసుకోక పోవడంతో అనారోగ్య పాలవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. అధికారంలోకి రాక ముందు ధరలు పెరిగిపోయాయి యంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. అదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం పూర్తిగా విఫలమయ్యాయి.

రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయాలి

రేషన్ షాపుల ద్వారా రాయితీలతో పెరిగిన నిత్య వస్తువులను సరఫరా చేయాలని అలాగైతేనే సామాన్యుల మీద భారం తగ్గుతుంది. ధరల పెరుగుదల గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

-హసీనా, గృహిణి పులివెందుల

ఉన్నంతలో సర్దుకోవాల్సిన పరిస్థితి

విపరీతంగా పప్పు, నూనె, కూరగాయల ధరలు పెరగడంతో కొన్నిటిని తగ్గించుకుని ఉన్నదాంతో సరిపెట్టుకొని బతకాల్సి వస్తుంది. ఇంకా ఇలా ఎన్ని రోజులు ఉంటుందో అర్థం కాని పరిస్థితి.

-భవాని, వ్యవసాయ కూలీ పులివెందుల

ప్రభుత్వాలు మారినా.. ధరలు మారలేదు

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ధరలు మాత్రం మారలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా మాట్లాడి అధికారం వచ్చిన తర్వాత ధరల నియంత్రణ చేయలేక సాకులు చెబుతున్నాయి. పేదల బతుకు మారేది ఎప్పుడు అన్న సందేహం కలుగుతుంది.

-గోపాల్, చిరు ఉద్యోగి , పులివెందుల



ఎపిజిబి ప్రధాన కార్యాలయం తరలింపు తగదు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని మరో 3 బ్యాంకుల విలీనం తర్వాత అమరావతికి తరలించాలన్న ప్రయత్నం తగదని, ఇది పాలకవర్గ పార్టీలకు రాయలసీమ పట్ల ఉన్న వివక్షకు నిదర్శనమని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు హరి కిషోర్‌రెడ్డి, అరసం అధ్యక్షులు ఆచార్య ఈశ్వర్ రెడ్డి, ప్రయివేట్ విద్యా సంస్థల సంఘం నేత జోగిరామిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలిరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నేత జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, వైసిపి జిల్లా నేతలు గాలి చంద్ర, జి.చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, ఎస్ ఏ సత్తార్, సునీల్ కుమార్ సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని విలీనం తర్వాత కూడా కడపలోనే కొనసాగించాలని కోరుకుంటున్నారని తెలిపారు. వ్యాపారంలో, లాభాల్లో, మౌలిక సదుపాయాలు కలిగి ఉండడంలో, సాంకేతికత, కరెన్సీ చెస్ట్ ఇలా అన్నింటా ఎపిజిబి దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అలాంటి బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడమంటే వెనకబడిన ప్రాంతాల పట్ల కక్ష పూరిత వైఖరి ప్రదర్శించడమేనని అన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్ఎంఇ ట్రైనింగ్ సెంటర్‌ను, న్యాయ విశ్వవిద్యాలయాన్ని, హైకోర్టును, నార్కోటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, సాంప్రదాయం ప్రకారం కడపలోనే ఎపిజిబి హెడ్ క్వార్టర్‌ను కొనసాగించాలని చెప్పారు. లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని పక్షాలను, సంఘాలను, తరగతులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రచయిత పాలగిరి విశ్వ ప్రసాద్ రెడ్డి, డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ డా.డివికె.కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, ఆర్టిపిపి సుబ్బిరెడ్డి, శివశంకర్, రామాంజనేయులు, రాజమణి, ప్రసాద్, కాంగ్రెస్ ప్రతినిధి మైనుద్దీన్, ఎల్ఐసి సంఘాల ప్రతినిధులు శంకర్రావు, శ్రీనివాస్, నిత్యానంద రెడ్డి, కస్తూరి, బ్యాంకు సంఘాల ప్రతినిధులు అబ్దుల్ అజీజ్, జగదీష్, ప్రసన్న, శివ శంకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లక్ష్మీ రాజా, మహేష్, శ్రీనివాస్, జెవివి ప్రతినిధులు రాహుల్, వెంకటసుబ్బయ్య, నరసింహారెడ్డి, రాజు, బుద్ధిస్ట్ సొసైటీ ప్రతినిధులు కుమారస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు హరికిషోర్ రెడ్డి

రైతు ఇంట్లో రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి- సింహాద్రిపురం

మండలంలోని దుద్దికుంటలో రెండు రోజుల కిందట రైతు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మృతుడు కొమ్మెర నాగేంద్ర పొలం, ఇంటిలోని పలు రికార్డులను పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య పరిశీలించారు. ఆదివారం దుద్దేకుంటలోని నాగేంద్ర ఇంటిలో కుటుంబ సభ్యులు పోలీసుల సమక్షంలో బీరువాలను తెరచి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు బ్యాంకులకు సంబంధించిన పాస్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రావులకొలను గ్రామంలోని నాగేంద్ర పొలాన్ని పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలోని పలువురుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఆయన వెంట పులివెందుల అర్బన్ సిఐ నరసింహులు, తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి బాబు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి : పౌరహక్కుల సంఘం

రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని రాష్ట్ర పౌర హక్కుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని దుద్దేకుంటలో నివాసం ఉన్న కొమెర నాగేంద్ర శ్రీవాణి వారి పిల్లల ఆత్మహత్యపై పౌర హక్కుల సంఘం కడప జిల్లా శాఖ నిజ నిర్ధారణ కమిటీ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేంద్ర ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఒకటిన్నర ఎకరాల పొలమే కాకుండా మొత్తం 13 ఎకరాలు కౌలుకు తీసుకోవడం కూడా అన్నారు. దాదాపు ఆరు, ఏడేళ్ల నుంచి పొలం పెట్టుకుంటూ పెట్టుబడిగా రూ. 30 లక్షలు అప్పు చేశారన్నారు. ఈ క్రమంలోనే అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి చేయడంతో వాటిని తీర్చే మార్గం లేక మొత్తం కుటుంబవంఆత్మహత్య చేసుకున్నట్లు అర్థమవుతుందన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని పెట్టుబడి రాక నాగేంద్ర కుటుంబం ఆత్మహత్యకు పాల్పడడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షులు పి రెడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎం రవిశంకర్ పాల్గొన్నారు.

ఎస్‌సి కళాశాల

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలోని ప్రకాష్‌నగర్ ఎస్‌సి కళాశాల హాస్టల్ వార్డెన్ సుభాష్‌ను సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో ఎస్‌సి హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయన మాట్లాడుతూ వార్డెన్ సుభాష్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా, దురుసుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నాలుగు రోజులుగా హాస్టల్‌లో కరెంట్ లేకుండా విద్యార్థులు అవస్థలు పడుతుంటే కనీసం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. నాలుగు రోజులు విద్యార్థులు దోమలు, చలికి తీవ్ర అసౌకర్యాలకు, అవస్థలు పడుతున్నారని, తాగడానికి నీళ్లు కూడా లేదని పేర్కొన్నారు. హాస్టల్ మొత్తం దుర్వాసన వెదజల్లుతుంటే శుభ్రం చేయించాలని విద్యార్థులు అడిగినా పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు. హాస్టల్‌లో ఫ్యాన్లు కూడా కొన్ని పని చేయడం లేదన్నారు. కరెంటు లేక హాస్టల్‌లో పిల్లలు ఇబ్బంది పడితే పక్క హాస్టల్‌లో వెళ్లి పడుకోండి అని ఉచిత సలహా ఇస్తున్నారని పేర్కొన్నారు. భజనం కూడా సరిగ్గా ఉండడం లేదని విద్యార్థులు తమ దృష్టికి తెచ్చారు అన్నారు. సుభాష్ వార్డెన్ బద్వేల్, కడప రెండు చోట్ల విధులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు సరైన న్యాయం చేయలేకపోతున్నారని చెప్పారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు తప్పవు

ప్రజాశక్తి- కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నూతన సంవత్సరాన్ని పోరాటాలతో స్వాగతం పలకక తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నగర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108,104 కార్మికుల పోరాటాల ఫలితంగా రూ.4వేలు అలవెన్స్ సాధించుకున్నామని గుర్తు చేశారు. వెంటనే స్పందించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆప్కాస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ఆధారంగా కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని పేర్కొన్నారు. వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను విభజించు పాలించు అనే పద్ధతిగా వ్యవహరించడం సబబు కాదని తెలిపారు. ప్రభుత్వ తీరు మారకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, సిఐటియు నగర కమిటీ సభ్యులు కిరణ్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు స్థలాలను పరిరక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రంలో అన్యక్రాంతమైన వక్ఫ్ బోర్డ్ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని మదరస మదినతుల్ ఉలూమ్‌లో ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తామన్న వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని ఇప్పటికే దేశవ్యాప్తంగా ముస్లిం సంఘాలు, ముస్లిం సమైక్యవేదిక మద్దతు తెలుపుతూ నిరసనలు నిర్వహించడంతో కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేసిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవక్ఫ్ బోర్డ్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలి ఉన్నవక్ఫ్ బోర్డ్ స్థలాలను ముస్లిం మైనార్టీల ఉపాధి, సంక్షేమానికి ఉపయోగపడేలా చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం సమైక్యవేదిక రాబోయే కాలంలో చేపట్టేబోయే కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు, కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని జనవరిలో నిర్వహించేందుకు తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించేందుకు ముస్లిం సమైక్యవేదిక ముందుంటుందని తెలిపారు. భవిష్యత్తులో ముస్లి ములను చైతన్యపరిచి హక్కులు, బాధ్యతలు సమాజానికి చేయాల్సిన సేవ గురించి వివరిస్తూ ముందుకు తీసుకుని వెళ్తామని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాల నుంచి ముస్లిం సమైక్య వేదిక జనరల్ సెక్రటరీ అహ్మద్ చందన్, వైస్ ప్రెసిడెంట్ మహబూబ్ ఆలీ, మౌలా బేగ్, జాయింట్ సెక్రటరీ అడ్వకేట్ సాదిక్, అన్వర్, రహీమ్ ఖాన్, ట్రెజరర్ అబ్దుల్ కలాం, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు మసి ఉల్లాహ్, సర్దార్ ఖాన్, అబ్దుల్లాహ్ ఖలీల్, అజీజ్, నాగూర్ వలీ, నూర్ ఖాన్, మెహతాజ్ బేగం, నసీమా, పర్వీన్, ఇబ్రాహీం, సర్తాజ్ అహ్మద్, జాన్ వలీ, సయ్యద్ మొహమ్మద్ జిక్రియాపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సలావుద్దీన్

ఎంపిడిఒపై దాడి దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి- కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎంపిడిఒపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులపై దాడి సరైంది కాదని తెలిపారు. సమస్యలపై అడగచ్చు, చెప్పచ్చు, పరిష్కారం చేయమని మాట్లాడొచ్చు కానీ అన్యాయంగా కొట్టడం ఏమిటి అన పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజల సమస్యలు పరిష్కరించడంలోనూ, అధికారుల పాత్ర కీలకమైందని తెలిపారు. అలాంటి అధికారుల పైన దాడి దుర్మార్గమని పేర్కొన్నారు. ఎవరైనా అధికార్లు ప్రజల సమస్యలపై స్పందించకపోతే వాటి మీద ఫిర్యాదు చేయొచ్చు, పై అధికారులకు తెలుపవచ్చు, కానీ గుంపుగా వచ్చి దాడి అత్యంత హేయమైన చర్యని తెలిపారు. ఇలాంటి వారి పైన కఠినంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బద్వేలు : కడప నగరంలో జనవరి 4, 5 తేదీలలో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, బద్వేల్ రూరల్ కార్యదర్శి దాసరి వెంకటేష్ కోరారు. ఆదివారం జిల్లా మహాసభల కరపత్రాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 4న ఉదయం జియోన్ కాలేజీ నుంచి ర్యాలీ ప్రదర్శన అనంతరం ఐటిఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా కర్నూల్ మాజీ శాసనసభ్యులు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. మహాసభకు జిల్లా వ్యాప్తంగా సిపిఎం చేసిన కృషిని సమీక్ష చేసి రానున్న కాలంలో ప్రజల సమస్యల పట్ల పార్టీ చేయాల్సిన పోరాటాలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో సిపిఎం రామకృష్ణారెడ్డి, రాంబాబు, ఓబులేసు, రాజు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి కడప అర్బన్ : పార్లమెంట్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై అమిత్‌షా చైని వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 30న ఉదయం 10గంటలకు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్ రెడ్డి, కో కన్వీనర్ బి.లక్ష్మి రాజా, ఇంజినీర్ గుర్రప్ప ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన ధర్నాకు అభ్యుదయ, అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామ్య వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

నేడు 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కడప : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కు సోమవారం జిల్లాలో 19 గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ లోని అట్లూరు మండలం కమలకూరు, బి. కోడూరు మండలం వేమకుంట, బి మఠం మండలం గొడ్లవీడు, బద్వేల్ మండలం తిరువెంగలాపురం, కలసపాడు మండలం దిగువ తంబళ్లపల్లి, మైదుకూరు మండలం శెట్టివారిపల్లె తదితర గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు.

ఎన్‌డిపిఎస్ కోర్టును కడపలోనే ఉంచాలని వినతి

ప్రజాశక్తి - కడప : కడప జిల్లా కేంద్రమైన కడపలోనే ఎన్‌డిపిఎస్ కోర్టును ఏర్పాటు చేయాలని, తిరుపతిలో ఏర్పాటుకు సంబంధించిన జీవో నెంబర్ 145 వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆదివారం న్యాయశాఖ మంత్రి ఫారూఖ్ ను కడప న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు కలిసి వినతి పత్రం అందజేశారు. కేవలం తిరుపతిలోనే ఎన్‌డిపిఎస్ కోర్టును ఏర్పాటు చేయడం తగదని స్పష్టం చేశారు. న్యాయవాదుల న్యాయ సమ్మతమైన ఈ డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంతవరకు పరిష్కరించాలని మంత్రిని ఈ సందర్భంగా బుగ్గల గుర్రప్పనాయుడు కోరారు.

టిడ్కో ఇళ్ల పనులను వేగవంతం చేస్తాం

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.రత్నం రాజు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేశాం. కడప, యర్ర గుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడమైంది. 300 స్క్వేర్ ఫీట్, 365 స్క్వేర్ ఫీట్,430 స్క్వేర్ ఫీట్ చొప్పున మూడు కేటగిరీలుగా ఇళ్ల నిర్మా ణాలను చేపట్టాం. కడప నగర పరిధిలోని ఎస్టేట్‌లోని 1584 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశాం. రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులను కల్పించడమే ఆలస్యం. దీనిపై సంబంధిత కాంట్రాక్టు సంస్థలపై సంప్రదించడమైంది. కాంట్రాక్టు సంస్థలు కదలిన వెంటనే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిందమైంది. ఫలితంగా సంబంధిత లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని పేర్కొంటున్న టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.రత్నంరాజుతో ముఖాముఖి...



ముఖా ముఖి..

టిడ్కో ఇళ్ల పురోగతి ఎలా ఉంది?

ఉమ్మడి కడప జిల్లాలో కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్ట డమైంది. ఇందులో కడప పట్టణ పరిధిలోని ఎస్టేట్, చలమారెడ్డిపల్లి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ పనులను చేట్టాం. చిన్నచౌక్ పరిధిలోని ఎస్టేట్ ప్రాంతంలో 1,584 ఇళు ,,చలమారెడ్డిపల్లి ప్రాంతంలోని 1,440 ఇళ్లలో 992 ఇళ్లను పూర్తి చేయడమైంది.

టిడ్కో ఇళ్ల వివరాలు తెలపండి?

ఉమ్మడి కడప జిల్లాలోని కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడమైంది. ఇందులో కడపలోని చలమారెడ్డిపల్లిలో 1440, ఎస్టేట్‌లో 144, యర్రగుంట్లలో 1440, జమ్మలమడుగులో 1440, ప్రొద్దుటూరులో 144, రాయచోటిలో 240 వెరసి 4,848 ఇళ్ల నిర్మాణాలను చేపట్టాం. ఇందులో 2,226 ఇళ్లను పూర్తి చేశాం.

ఇళ్ల రిజిస్ట్రేషన్ల పట్ల స్పందన ఎలా ఉంది?

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ బాగుంది. ఉమ్మడి కడప జిల్లాలో ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని144 టిడ్కోఇళు మినహా కడప, యర్రగుంట్ల, జమ్మలమడుగు, రాయచోటి పట్టణ ప్రాంతాల్లోని 300, 365, 430 కేటగిరీల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడమైంది. ఇందులో 300 స్క్వేర్‌ఫీట్ పరిమాణం కలిగిన ఇళ్లకు ఒక్క రూపాయితోనే రిజిస్ట్రేషన్ చేశాం. మిగిలిన రెండు రకాల ఇళ్ల లబ్ధి దారులు రూ.25 వేల చొప్పున లబ్ధిదారుని వాటా కింద చెల్లించాం.

మౌలిక వసతుల గురించి చెప్పండి?

టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది. తాగునీరు, రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్, ఎస్‌టిపి సరఫరా వంటి సమస్యలను పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రధానం. 75 శాతంపైగా ఎస్‌టిపి నిర్మాణాన్ని పూర్తి చేయడమైంది.

కాంట్రాక్టు సంస్థల మందగమనానికి కారణమేమిటి?

టిడ్కో ఇళ్ల కాంట్రాక్టు సంస్థల మందగమనానికి గల కారణాలు తెలియదు. అది ప్రభుత్వాల పరిధిలోని అంశం. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఎన్‌సిసి, దాస్, డిఇసి, ఎంఎస్ఆర్, ఇన్‌ఫ్రా కాంట్రా క్టు సంస్థలను సంప్రదించడమైంది. కాంట్రాక్టు సంస్థలు అందుబా టు లోకి వచ్చిన వెంటనే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తాం.



కెసి కాలువలో ఆగిన నీటి సరఫరా

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువ ఆయకట్టు పరిధిలో వరి నూర్పిడి పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా కాలువకు నీటిని నిలుపుదల చేశామని ఎఇ గురుమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మండల పరిధిలో ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నీటితో రైతులకు అవసరం లేదు. అంతేకాకుండా గత నెల రోజులుగా తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో ఆరుతడి పంటలకు కూడా తాత్కాలికంగా నీటి అవసరం ఏమాత్రం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కాలువలో నీరు వృథాగా పోతుందన్న కారణంతో రైతు అభిప్రాయం మేరకు నీటిని నిలుపుదల చేశామన్నారు. వరి పంట నూర్పిడి పనులు పూర్తయిన తర్వాత మళ్లీ నీటిని విడుదల చేస్తామని ఎఇ తెలిపారు.



ఆర్థికసాయం అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పేదలను ఆదుకోవడమే మానవత లక్ష్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదలను ఆదుకోవడమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని ఆ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఎస్‌డబ్ల్యు. బి.గురుప్రసాద్, రిటైర్డ్ అధ్యాపకులు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రెండు కాళ్లు కోల్పోయిన శామ్యూల్‌కు వైద్య నిమిత్తం రూ.7వేలు ఆర్థిక సాయాన్ని ఆయన సతీమణికి అందజేశారు. మానవత చైర్మన్ డివి కొండారెడ్డి, సెక్రెటరీ గంగిరెడ్డి, కోశాధికారి హరి చంద్రారెడ్డి సంస్థ కార్యకలాపాలను వివరించారు. సమావేశానికి హాజరైన సభ్యులకు రిటైర్డ్ హెడ్మాస్టర్ డి.సదాశివరెడ్డి అల్పాహారం ఏర్పాటు చేశారు.

ఎంపిడిఒపై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న ఎ.వినయ్‌కుమార్

అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో విధి నిర్వహణలో ఉన్న ఎంపిడిఒ సిఐ జవహర్ బాబుపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమని కెవి పిఎస్ నాయకుడు ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులపై దాడి సరైంది కాదన్నారు. సమస్యలపై అడగొచ్చు, చెప్పొచ్చు పరిష్కారం చేయమని మాట్లాడొచ్చు కానీ కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ జవహర్‌బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

పాఠశాల భవనాలను పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -బ్రహ్మంగారిమఠం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో భాగంగా ఆగిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహూల్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు పూర్తికాకుండా మధ్యలో ఆగిపోయాయని తెలిపారు. భవనాల నిర్మాణం సందర్భంగా అక్కడ ఉన్న ఇటుకలు, దిమ్మెలు, ఇసుక కడ్డీలు వంటివి విద్యార్థులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ప్రమాదాలు కూడా జరిగి అవకాశం ఉందన్నారు. మఠంలోని బాలికల హైస్కూల్, సోమిరెడ్డిపల్లి, పాపిరెడ్డిల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే అసం పూర్తి భవనాలను పూర్తి చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాహుల్ హెచ్చరించారు.

గర్భిణుల ప్రాణాలకు గ్యారెంటీ లేదా..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు దాసరి విజయ్

ప్రభుత్వాసుపత్రిలో గర్భిణుల ప్రాణాలకు గ్యారెంటీ లేదా అని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మాస్టర్ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి రోగులు రావాలంటే హడలిపోతున్నారని తెలిపారు. కొలిమిగుండ్ల మండలానికి చెందిన సుమతి అనే గర్భిణీ ఈనెల 27న శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయిందన్నారు. శనివారం బిడ్డకు జన్మనిచ్చాక డాక్టర్లు సరైన వైద్యం చేయకపోవడంతో బాలింత సుమతి మృతి చెందిందన్నారు. సుమతి మతికి బాధ్యత వహించాల్సిన డాక్టర్లు తమ తప్పు ఏమీ లేదని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి గర్భిణీ మృతి పట్ల స్పందించి నష్టపరిహారం రూ.30 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంధ్య థియేటర్ రేవతి మృతి పట్ల ఆ రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు లాగానే ప్రాణం విలువ ఎవరిదైనా ఒకటే కాబట్టి వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో కమల్ బాషా, హాజీ, జమాల్ బాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సిఆర్‌సి కుమారుడి మృతికి మంత్రి ఫరూక్ నివాళి

ప్రజాశక్తి-కడప అర్బన్

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు విష్ణు స్వరూప్ గుండె పోటుతో శనివారం మృతి చెందిన విషయం విధితమే. ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం కడప కో-ఆపరేటివ్ కాలనీలోని రామచంద్రయ్య స్వగృహంలో ఉంచారు. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ కడపకు చేరుకుని విష్ణు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుమారుడిని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న రామచంద్రయ్యను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బరాయుడు, తిరుపతి జిల్లా జనసేన అధ్యక్షుడు హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ చంగల్ రాయుడు, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, బాలసుబ్రమణ్యం, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, కుప్పాల వెంకటసుబ్బయ్య, టీవీఎస్ మూర్తి పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళి అర్పించారు. అనంతరం చలమారెడ్డిపల్లి, బండి కనుమ వద్ద ఎమ్మెల్సీ మామిడి వనంలో విష్ణు స్వరూప్ పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.లెక్చరర్, ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ మహిళ డిగ్రీ కళాశాల,కడప) సలహాదారులు డాక్టర్ ముహమ్మద్ నిసార్ అహ్మద్, (ప్రొఫెసర్, ఉర్దూ విభాగం, ఎస్ వి యూనివర్సిటీ, తిరుపతి) డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుస్సేన్ (సీనియర్ లెక్చరర్, డైట్, కర్నూలు) రాష్ట్ర సమన్వయకర్త షేక్.ముహమ్మద్ అయ్యూబ్, (కడప)లను ఎన్నుకున్నారు.

పారిశుధ్యం.. అధ్వానం

ఇబ్బందుల్లో గుంతచియ్యపాడు అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణులు, బాలింతలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని గుంతచియ్యపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు మరింత దారుణంగా తయారైంది. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై పూర్తిగా బురదమయంగా ఉండడంతో దోమలు వృద్ధి చెందుతూ అనారోగ్య బారిన పడుతున్నారు. కొన్నేళ్లుగా ఈ సమస్య వేధిస్తోంది. ప్రభుత్వాలు మారినా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మెరుగ్గా చేపట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రజలు నానా అవస్థలు పడాల్సివస్తోంది. ప్రజలు కూడా కొంతమంది గృహావసరాలకు వినియోగించిన నీరు రోడ్లపై వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిత్యం దారి బురదమయంగా ఉంటోంది. డ్రయినేజీ కాలువలను ఏర్పాటు చేస్తే ఈ సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రం వద్ద అధ్వానంగా ఉన్న బురద రోడ్డును ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అంగన్వాడీ కేంద్రం వద్ద అధ్వానంగా ఉన్న పరిసరాలు

ఆరోగ్యమే మహాభాగ్యం : ఆర్‌డిఒ



వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఆర్‌డిఒ సాయిశ్రీ


ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆరోగ్యమే మహా భాగ్యమని జమ్మలమడుగు ఆర్‌డిఒ ఆది మూలం సాయి శ్రీ పేర్కొన్నారు. స్థానిక బాలాజీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం మహిళలకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని హైకోర్టు న్యాయవాది బైరెడ్డి లక్ష్మిరెడ్డి తల్లిదండ్రులైన స్వర్గీయ సూర్య నారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకు ట్రస్ట్ ద్వారా ముందుకు వచ్చిన న్యాయవాది బైరెడ్డి లక్ష్మిరెడ్డిని అభినందిస్తున్నామన్నారు. మహిళలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బైరెడ్డి లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల మహిళలకు అన్ని రకాల జనరల్ పరీక్షలు నిర్వహిం చామన్నారు. ముఖ్యంగా గర్భాశయ పరీక్షలు చేసి ఆరోగ్య నిపుణులచే సలహాలు ఇప్పించామని తెలిపారు. దాదాపు 150 మంది రోగులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. డాక్టర్లు వి.ఉషారాణి, కె.శ్రీలత, ఎం.శ్యామలమ్మ, చెన్నైకి చెందిన రాయల్ హాస్పిటల్ డాక్టర్ బైరెడ్డి నిఖిత, బైరెడ్డి శ్రీనవ్య, రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ బి.స్వప్న, తాతిరెడ్డి రామలింగారెడ్డి నర్సింగ్ హోమ్ ఆస్పత్రి డాక్టర్ జి.సుచరిత, గజ్వేల్ నర్సింగ్ హోమ్ డాక్టర్ శారద, శంకర్ నర్సింగ్ హోమ్ డాక్టర్ వసంతలక్ష్మి రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్యులకు లక్ష్మిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రా రెడ్డి, డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి, వైద్యశిబిరం సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధక్షులు వీరణాల శివనారాయణ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆయన ఆదివారం రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లోని సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించాలని కోరారు. ప్రయాణికులకు తాగునీరు, టాయిలెట్ సౌకర్యం లేవన్నారు. ప్రధాన వసతులైన ఆ రెండు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జమ్మలమడుగు స్టేషన్ మీదుగా తిరుపతి టు గుంటూరు, ధర్మవరం టు మచిలీపట్నం, నంద్యాల డెమో సర్వీసులు జమ్మలమడుగు మీదుగా తిరుగుతూన్నాయని తెలిపారు. నిత్యం వందల మంది రైలులో ఈ వైపు ప్రయాణిస్తున్నార న్నారు. స్టేషన్ మాస్టర్ గది పై కప్పు పెచ్చులు ఉడిపోయాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు జమ్మలమడుగు రైల్వేస్టేషన్ మీద దృష్టి సారించిం సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో నారాయణ, ముని, రాము, చంటి, సంజీవ రాయుడు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న చేనేత నాయకులు

ఎంపిజె రాయలసీమ ఇన్‌ఛార్జిగా అయూబ్ ఖాన్



అయూబ్ ఖాన్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎంపిజె రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రధాన కార్యదర్శి సలీం రాయలసీమ ఇన్‌ఛార్జిగా ఎండి అయూబ్ ఖాన్‌ని నియమించారు. ఆ మేరకు ఆయన ఆయూబ్‌ఖాన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం స్థానిక జిన్నా రోడ్డులోని ఎంపిజె కార్యక్రమంలో సభ్యత్వ నమోదు, శిక్షణ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుప్రీం కౌన్సిల్ మెంబర్ హుస్సేన్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం హాజరయ్యారు. ఈసందర్భంగా సలీం మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో శాంతి, న్యాయస్థాపన కోసం ఎంపిజెలో చేరండని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి మాట్లాడుతూ ప్రజలకు వైద్య, విద్య, ఆహారం సమానంగా లభించినప్పుడే రాష్ట్రంలో సుఖ సంతోషాలు ఉంటాయన్నారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర బాధ్యులు తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ.. ఈ పదవికి సరైన న్యాయం చేకూరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు రవి, ముక్తయార్, సయ్యద్, ఇర్ఫాన్ సత్తార్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేరుశనగ సాగు

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండల పరిధిలోని పలు గ్రామాలలో వేరుశనగ సాగును రైతులు విస్తారంగా చేపట్టారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా పెన్నానది పరివాహక గ్రామాలు తిప్పి రెడ్డిపల్లి, అనంతపురం, రాజుపాలెం, నరహరిపురం, వెదురూరుతోపాటు పలు గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేపట్టారు. సాధారణంగా సెప్టెంబర్ నెలలో వేరుశనగ సాగు చేపడతారు. ఈ ఏడాది అక్టోబర్ చివరి వరకు సాగు చేపట్టారు. ఈ ఏడాది మైలవరం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేయడంతో పంటకు సాగునీటి కొరత లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేరుశనగలో కలుపులు తీత చేస్తున్నారు. సత్తువలు వేస్తున్నారు. రబీ సీజన్‌లో వేరు శనగతో పాటు రైతులు అధికంగా మినుము, మొక్కజొన్న పంటలను కూడా సాగు చేపట్టారు. వెంగన్నగారి పల్లి, చియ్యపాడు పరిధిలో శనగ పంట రైతులు సాగు చేపట్టారు.



తిప్పిరెడ్డిపల్లె వద్ద సాగులో ఉన్న వేరుశనగ పంట



విద్యార్థిని అభినందిస్తున్న కౌన్సిలర్ శివజ్యోతి

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లలకు చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యమని 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతి అన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన పాఠశాలల అండర్-15 విద్యార్థులకు స్థానిక శివశంకర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రొద్దుటూరు చెస్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం చెస్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ శివజ్యోతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెలవు దినాల్లో పిల్లలు అధికంగా సెల్‌ఫోన్‌లకు అంకితమవుతున్నారని, ఇది ఒక వ్యసనంగా మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పిల్లలకు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర వుతున్నాయన్నారు. చెస్ క్రీడాకారులను పిల్లలు ఆదర్శంగా తీసుకొని మేధో సంపత్తిని పెంపొందించుకోవాలన్నారు. యుక్తవయసు పిల్లలంతా ఏదోక క్రీడలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ప్రధాన ఉపా ధ్యాయులు ఇమామ్‌హుసేన్, టిఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్, ప్రొద్దుటూరు చెస్ క్లబ్ నిర్వాహకులు రెడ్డి పవన్, ఆర్బిటర్ ముజమీల్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు విజయవంతం

ప్రొద్దుటూరు : బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక టివిఆర్ పాఠశాల సమీపంలో ఆదివారం నిర్వహించిన క్రాస్ కంట్రీ పోటీలు విజయవంతమయ్యాయి. జిల్లాస్థాయి బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంశాపత్రాలు అందించారు. వీరు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా తెలిపారు. జనవరి 5న ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరుగబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ (దూరపు పరుగుపందెం) వైఎస్సార్ కడప జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వ్యాయామ సంచాలకులు పి.వెంకటసుబ్బయ్య, లక్ష్మి, చరణ్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు, సంజీవ్, దిలీప్, ఖాదర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు రబ్బాని ఈ క్రీడల నిర్వహణలో సహకరించారని వారికి అహ్మర్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు.



పోటీపడుతున్న క్రీడాకారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేశారని తెలిపారు. ప్రభుత్వ భూములు, చర్చి భూములు కబ్జా చేశారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ఎక్కడ కూడా ఒక్క రోడ్డు వేయలేదని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ ముక్తియార్, కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రారెడ్డి, నాయకులు పగిడేల దస్తగిరి పాల్గొన్నారు.



నూతన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నేతలు

నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - వేముల

స్వచ్ఛమైన శుద్ధి తాగునీటిని ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం వేల్పుల గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు రాగిపిండి సుధాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన నూతన వాటర్ ప్లాంట్‌ను పేర్ల శేషారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బ్రహ్మయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్థసారధిరెడ్డి, జోగిరెడ్డి మాట్లాడుతూ పేదలకు సురక్షిత మంచినీరు అందించాలనే ఉద్దేశంతో సుధాకర్‌రెడ్డి మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాగిపిండి హనుమంత్‌రెడ్డి, పిండి శివకేశవరెడ్డి, లక్కిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, లక్కిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, లక్కిరెడ్డి వీరారెడ్డి, లక్కిరెడ్డి జయరామిరెడ్డి, వేల్పుల చెరువు చైర్మన్ రాగిపిండి శ్రీనివాసులు రెడ్డి, ప్రజలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి 27 కుటుంబాలు

మండలంలోని వేల్పుల పంచాయతీలోని బెస్తవారిపల్లి గ్రామ టిడిపి నాయకుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి 27 కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. సంపతి అశోక్ కుమార్, పట్టపాటి ఆంజనేయ, వల్లూరు గంగాధర, పీట్ల రామాంజనేయులు, అద్దాలమరి గంగరాజు, సిద్ధంరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు మరికొందరికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధి రెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, పేర్ల శేషారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, మబ్బుచింతలపల్లి శ్రీనాథ్‌రెడ్డి, వేల్పుల రాగిపిండి సుధాకర్ రెడ్డి, రాచకుంటపల్లి ఓబులేసు, పేర్ల సత్యమారెడ్డి, కర్ణ పెద్దారెడ్డి, పోటు గంగాభాస్కర్ పాల్గొన్నారు.

రేపటిలోగా రైతులు ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు మంగళవారంలోపు ఫసల్ బీమా ప్రీమియం చెల్లించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు మండల వ్యవసాయ అధికారి ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. రబీలో సాగైన వేరుశనగ,శనగ, నూగు, మినుము, పెసర, పొద్దు తిరుగుడుతోపాటు వరి పంటలకు ఫసల్ బీమా ఇన్సూరెన్స్ చేసుకోవడానికి ఈనెల 31వరకు గడువు ఉందన్నారు. ప్రీమియం చెల్లించని రైతులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అడవులు అంతరిస్తే ముప్పే

ప్రజాశక్తి - వేంపల్లె



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అడవులు క్రమంగా అంతరించి పోతున్నాయని, దీని పర్యవసానంగా ప్రపంచానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో అంత ర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యం ప్రాముఖ్యత, వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడుతాయన్నారు. అభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేయడం వల్ల అడవులు క్రమేణా అంతరించి పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు సహజ వనరులను అవసరం మేరకు వినియోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు. సదస్సులో ఎఒ రవికుమార్, అనిల్‌కుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ చేయడం కొద్దిమందికే సాధ్యం

జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

సేవ చేయాలనే ఆకాంక్ష చాలా మందిలో ఉన్నా వారిలో కొంత మందికే సాధ్యపడుతుందని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్, ప్రముఖ విద్యావేత్త, హిందూపురం మాజీ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి లయన్ పి.ఖాసీం ఖాన్, ఆడిటర్స్ రాష్ట్ర సలహాదారుడు షరీఫ్ ఖాన్ పేర్కొన్నారు. నగరంలోని కోపరేటివ్ కాలనీలో ఉన్న కె కె ఆడిట్ కార్యాలయంలో ఆదివారం సేవ్ గర్ల్ చైల్డ్ అనే నినాదంతో రూపొందించిన జన వికాస సేవా సమితి నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పేద ప్రజలను ఆదుకోవడానికి 12 సంవత్సరాల నుంచి ఎన్నో సేవలు నిర్వహిస్తున్న తాహిర్‌ను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నగర ఉపాధ్యక్షుడు పి.మన్సూర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు పి.అఫ్జల్ అలీ ఖాన్, ఐయుఎంఎల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్. అలీ షేర్, సంస్థ ప్రతినిధులు నూనె నగేష్, డాక్టర్ శ్రీనివాసులు, సి.ఎస్.నాసర్ అలీ, అబ్దుల్ వాజీద్, మస్తాన్ వల్లి, వల్లెపు శివ, డాక్టర్ అహ్మద్ పాల్గొన్నారు.



కేలెండర్ ఆవిష్కరిస్తున్న సురేష్ కుమార్, ఖాసిం ఖాన్